క్లుప్తంగా

ఏయూ రిజిస్ట్రార్‌కు అభినందన



రిజిస్ట్రార్ ధనుంజయరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యార్థి నాయకులు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ధనుంజయరావుకు సోమవారం ఉత్తరాంధ్ర విద్యార్థి నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. జియాలజీ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ అనేక పదవులు విజయవంతంగా నిర్వహించి రిజిస్ట్రార్‌గా నియమితులవడం గర్వకారణమన్నారు. ఆయన సారథ్యంలో ఏయూ అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో ఉత్తరాంధ్ర విద్యార్థి నాయకులు సిర్ల శ్యాంసుందర్, ప్రొఫెసర్ రమేష్, సిహెచ్.ప్రసాద్, రవికుమార్, దేవానంద్, ఎస్.యు.ఎస్.దీక్షిత తదితరులు ఉన్నారు.

రహదారిపై మట్టికుప్పల తొలగింపు



ఇసుకతోట - వెంకోజీపాలెం రహదారిలో తొలగించిన మట్టికుప్పలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులో ఇసుకతోట పశు సంవర్ధక శాఖ ఆస్పత్రి నుంచి పాత వెంకోజీపాలెం రహదారిపై కేబుల్ లైన్ ఏర్పాటు కోసం తవ్విన మట్టికుప్పలు తొలగించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టికుప్పలు బురదమయమై వాహన చోదకులు, పాదచారులకు ఇబ్బందికరంగా మారాయి. వీటిని సోమవారం తొలగించడంతో ఇబ్బందులు తొలగాయని కాలనీల వాసులు పేర్కొంటున్నారు.

మొక్కలు నాటుదాం

ఆరిలోవ: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం 12వ వార్డు చినగదిలి సాయిబాబా ఆలయం, సూర్యతేజానగర్ వరకు ఉన్న రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో టీడీపీ, జనసేన నాయకులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్థానిక నాయకులతో కలిసి పలు రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోన్–2 కమిషనర్ శైలజావల్లి, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఏడువాక సన్యాసిరావు, బుడుమూరు గోవిందరావు పాల్గొన్నారు.

సూర్యతేజానగర్‌లో షాపుల ఏర్పాటు వద్దు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో రోడ్డు పక్కన నివాసాలను అనధికారికంగా వ్యాపారం కోసం షాపులుగా ఏర్పాటు చేయవద్దని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సూర్యతేజానగర్ వద్ద రోడ్డు పక్కన టీడీపీ, జనసేన నాయకులు నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను కొందరు స్థానికులు కలిసి కాలనీలో రోడ్డు పక్కనున్న నివాసాలను షాపులుగా మార్చుకుంటామన్నారు. రే పథకంలో భాగంగా నిర్మించిన ఈ నివాసాలు ఇప్పటికీ కొన్ని పూర్తి స్థాయిలో నిర్మాణం జరగలేదన్నారు. తలదాచుకోవడానికి కేటాయించిన నివాసాలను వ్యాపారాల కోసం వినియోగిస్తే అధికారులు తగు చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. కొందరు స్థానిక పెద్దలు మాటలు నమ్మి షాపులు ఏర్పాటు చేస్తే ఆ తర్వాత మీరే నష్టపోతారంటూ స్థానికులకు ఆయన సూచించారు.

9 వినతులు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారులు వినతులు అందజేశారు. తహసీల్దార్ ఎం.రమేష్ 9 మంది నుంచి వినతులు స్వీకరించారు.

మహానేత వైఎస్సార్‌కు మనసారా నివాళి

- వాడవాడలా ఘనంగా వర్ధంతి వేడుకలు
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

పేదల గుండెల్లో చిరస్మరణీయుడు.. బడుగు, బలహీన వర్గాల ఆపద్బాంధవుడు.. సంక్షేమ సారథి–అభివృద్ధి వారధి, నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసమే పరితపించిన మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి వేడుకలు సోమవారం తూర్పు నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. వార్డుల్లో కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, ప్రజలు వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద మనసారా నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి రాజన్న చేసిన సేవలను కొనియాడి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



ఆరిలోవ కాలనీ ఆఖరి బస్‌స్టాప్ వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నివాళులర్పిస్తున్న నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి నివాళులర్పించారు. పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి: మేయర్

13వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.

- రామకృష్ణాపురంలో గ్రామ సంఘం అధ్యక్షుడు వంకర బాబూరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతిలో మేయర్ పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, అల్లంపల్లి రాజబాబు, గూడపాటి విక్టర్, బోని శివరామకృష్ణ, సత్యాల సాగరికి, కె.శిరీషా, బేగం, కాకర గోవింద్, వెంకటరెడ్డి, కె.సుబ్బారావు, దుర్గారావు, వానపల్లి ఈశ్వరరావు, డేవిడ్, డాక్టర్ నాయుడు, వెంకట్, భాస్కరరావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల నివాళి

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డు చైతన్యనగర్‌లో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు పులగం సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. పార్టీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు మొల్లి అప్పారావు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- 16, 15 వార్డుల పరిధి కేఆర్ఎం కాలనీలోని పార్టీ వార్డు కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు మొల్లి అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, సిటీ సెక్రటరీ కందిమల్ల రాజశేఖర్, వేములవలస అప్పారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



11వ వార్డులో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, పార్టీ నాయకులు

పేదల పెన్నిధి

ఎంవీపీకాలనీ: పేదల గుండెల్లో మహానేత వైఎస్సార్ ఎప్పటికీ నిలిచే ఉంటారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు అన్నారు. 17వ వార్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించి నిరాశ్రయులకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు కె.రామారావు, కె.లక్ష్మణరావు, కె.వరహాలు, నీలారెడ్డి, శివ, జయమ్మ, తాతారావు, అన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

- 20వ వార్డు పెదవాల్తేర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు మద్ది పోలిరెడ్డి, బి.రమాదేవి, పండరీ బాయ్, ప్రసాదరెడ్డి, ఆంజనేయులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- 18వ వార్డు ఎంవీపీ సర్కిల్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. మత్స్యకార కార్పొరేషన్ మాజీ మాజీ చైర్మన్ పేర్ల విజయచందర్, ఎల్లాజీ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వేమన మందిరంలో..

సీతమ్మధార: ఆశీలమెట్ట వద్ద గల వేమన సంక్షేమ సంఘంలో జరిగిన వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిలో గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకం వల్లే లక్షలాది మంది నిరుపేదలు ఉచితంగా కార్పొరేట్ వైద్యం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, తిప్పల దేవన్‌రెడ్డి, సంఘ గౌరవాధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తి రామకృష్ణారెడ్డి, కోశాధికారి ఎస్.బాలిరెడ్డి, సత్తి సుబ్బిరెడ్డి, బోర కుమార్‌రెడ్డి, శ్యామ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



23వ వార్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



16వ వార్డులో రాజన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మొల్లి అప్పారావు తదితరులు



17వ వార్డులో పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న గేదెల నాగరాజు



20వ వార్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



వేమన మందిరంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి

గురుకులంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో విద్యార్థులకు సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రత్నవల్లి సమక్షంలో శ్రీకృష్ణాపురం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మహిత, సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్‌గా జ్వరాలతో బాధపడుతున్న కొందరికి మందులు అందజేశారు. ఇక్కడ విద్యార్థుల్లో 9 మంది ఎనిమీయాతో బాధపడుతున్నట్లు డాక్టర్ మహిత తెలిపారు. వారిని గుర్తించి కేజీహెచ్‌కు తీసుకెళ్లి వైద్యం అందించాలని గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లికి తెలియజేశామన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న శ్రీకృష్ణాపురం యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది

178 మందిపై ట్రాఫిక్ కేసులు

పీఎం పాలెం: హైవేపై నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 178 మందిపై కేసులు నమోదు చేశామని పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆర్ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.40,800 అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. విత్‌అవుట్ హెల్మెట్ కేసులు 128, రాంగ్ పార్కింగ్ చేసిన 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ వంటి కేసులు కూడా ఉన్నాయన్నారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించే వారు రూ.1,000, ఆపైన జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఆర్ఎస్ఐ హెచ్చరించారు.

డీఎంహెచ్‌వో యూపీహెచ్‌సీ సందర్శన

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం రామ్‌నగర్‌లోని భానోజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకుని, రికార్డులు పరిశీలించారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ అమలుపై ఆరా తీశారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, మలేరియా, డెంగ్యూ వ్యాధుల నివారణకు సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆశ కార్యకర్తలు, వైద్యాధికారులను సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



యూపీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

కాలభైరవ స్వామికి పూజలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెంలోని జ్ఞాన లింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన కాలభైరవ స్వామికి సోమవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ప్రకాష్, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరస్వామి ఆధ్వర్యంలో పూజలు జరిపించారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు బోర వెంకటరమణారెడ్డి, ఎర్రాజీ, మహిళా సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పూజలందుకున్న కాలభైరవుడు



కాలభైరవ స్వామి ఆలయంలో భక్తులు

అలలతో జాగ్రత్త సుమీ!

వాతావరణంలో వచ్చిన మార్పులు, భారీ వర్షాల కారణంగా సముద్రం ఉగ్రరూపం దాల్చింది. ఈ సమయంలో వచ్చే పెద్ద పెద్ద కెరటాలను చూసేందుకు యువత ఉత్సాహం చూపిస్తున్నారు. వాటి దగ్గర ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా సరే ప్రాణాలకే ప్రమాదం. ఈ సమయంలో అలలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని పలువురు సూచిస్తున్నారు. సోమవారం సముద్రంలో కెరటాలు ఉవ్వెత్తున లేచాయి. సాగరతీరాన కాసేపు సరదాగా గడపాలని వచ్చిన సందర్శకుల ముందుకొచ్చిన ఒక అల 10 అడుగుల మేర లేచి జాగ్రత్త సుమీ.. అంటూ హెచ్చరించింది.

– బీచ్‌రోడ్డు



నగరంలో 80 పునరావాస కేంద్రాలు

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

మధురవాడ: నగరంలో 10,620 మంది కోసం 80 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ చెప్పారు. 29 వార్డుల్లో పలు కొండవాలు ప్రాంతాలు గుర్తించినట్టు పేర్కొన్నారు. సోమవారం ఉదయం జీవీఎంసీ జోన్–2 పరిధిలోని 5వ వార్డులోని వికలాంగుల కాలనీ, స్వయంకృషినగర్‌లలో కొండవాలు ప్రాంతాలలో జారిపడిన కొండ చరియ, ప్రమాదంలో ఉన్న రక్షణ గోడలు, దెబ్బతిన్న ఇళ్లను ఆయన పరిశీలించారు. కొండవాలు ప్రాంతాల్లో ఉన్న వారు ఆందోళనకు గురికావద్దని, రక్షణ గోడలు పటిష్ట పరచడానికి జీవీఎంసీ చర్యలు చేపడుతుందని భరోసా ఇచ్చారు. స్వయంకృషినగర్ తాగునీటి సమస్య ఉందని చెప్పగా తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా పైపులైన్‌లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌ప్రసాద్‌ను ఆదేశించారు. రక్షణ గోడలు పునర్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఎస్ఈ శాంసన్‌రాజును ఆదేశించారు. కొండ చరియలు విరిగి పడిన ప్రాంతాల్లో ప్రజలకు ధైర్యం చెప్పాలని జోనల్ కమిషనర్ శైలజావల్లిని ఆదేశించారు. కార్యక్రమంలో 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతిరాజు, ఏఎంహెచ్‌వో కిషోర్, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మధురవాడ కొండవాలులో ప్రమాదకర స్థితిలో ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్

ఇగ్నో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జులై ప్రవేశాల గడువును ఈనెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ప్రమాదాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

దాబాగార్డెన్స్: పారిశ్రామిక ప్రమాదాలు అరికట్టాలని, ఇటీవల జరిగిన ప్రమాదాలపై సమగ్ర దర్యాప్తు జరిపి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. జగదాంబ జంక్షన్ సమీపాన సిటూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నేవీ సహకారంతో ఏరియల్ సీడింగ్

భీమునిపట్నం: మిషన్ గ్రీన్ భీమిలి ఆధ్వర్యంలో తయారు చేసిన విత్తన బంతులను నేవీ సహకారంతో సోమవారం ఏరియల్ సీడింగ్ నిర్వహించారు. భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న సన్‌సూకల్, విద్యాసాగర్ స్కూల్ విద్యార్థులు సుమారు కోటి విత్తనాలతో కూడిన 80 వేల విత్తన బంతులను తయారు చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ఏక్ పేడ్ మా కే నామ్ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో వేప, రావి, మర్రి, సీతాఫలం, దానిమ్మ, జామ మొదలైన వృక్షాలకు సంబంధించిన విత్తనాలు ఉన్నాయి. ఈ విత్తనాల బంతులను బీచ్‌రోడ్డులోని ఐఎన్ఎస్ కళింగకు చెందిన నావికాదళ ఉద్యోగులు హెలికాప్టర్ ద్వారా సొమ్మగిరి కొండవాలు ప్రాంతాల్లో వెదజల్లారు. మిషన్ గ్రీన్ భీమిలి సభ్యులు గుల్లల వెంకటేష్, ముమ్మిడిశెట్టి ఆదిత్య, ముసునూరి శ్రీనివాస్, కాళ్ల సన్నీ, పప్పు భరద్వాజ్, వారణాసి శివ, అల్లబోయిన భరత్ పాల్గొన్నారు.



విత్తన బంతులతో బయలుదేరుతున్న నేవీ సిబ్బంది

పొంగిన యూజీడీ.. రోడ్డెక్కిన మురుగు

బీచ్‌రోడ్డు: ఆర్కే బీచ్ రోడ్డులో నోవోటల్ ఎదురుగా ఉన్న యూజీడీ సోమవారం పొంగిపొర్లింది. దీంతో రోడ్డుపై మురుగు నీరు వరదలా పారింది. రహదారి మొత్తం నీరే ఉండటంతో ద్విచక్ర వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. చాలా సమయం తరువాత అదుపులోకి రావడంతో నీటి ప్రవాహం తగ్గింది.



నోవోటల్ ఎదురుగా యూజీడీ పొంగి ప్రవహిస్తున్న మురుగునీరు